# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 13-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- పర్యాటక రంగ అభివృద్ధితో ఉపాధి అవకాశాలు గణనీయంగా లభిస్తాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ప్రజలకు చౌకగా వైద్యంతో పాటు మందులు అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు.
- గేమింగ్, యానిమేషన్, వినోద రంగాల్లో ప్రతిభావంతులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు.
- జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తొలిదశలో 43 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ఈ రోజు జరిగింది.
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16 నుంచి 21 వరకూ 3 దేశాల్లో పర్యటించనున్నారు.

==============================

పర్యాటక రంగ అభివృద్ధితో ఘనమైన దేశ వారసత్వాన్ని కొనసాగించడమే కాకుండా ఉపాధి అవకాశాలు సైతం అధికంగా లభిస్తాయని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. కేంద్ర పాలిత ప్రాంతమైన దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూలో 3 రోజుల పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్రపాలిత ప్రాంతమైన డామన్ డయ్యూ, దాద్రా నగర్ హవేలీ ప్రాంతాలు పర్యాటకం, విద్య, పారిశ్రామిక అభివృద్ధిలో చేస్తున్న కృషిని కొనియాడారు. గ్రామాల అభివృద్ధిలోనే దేశాభివృద్ధి ఉందని రాష్ట్రపతి ఈ సందర్భంగా పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==============================

ప్రజలకు చౌకగా వైద్యంతో పాటు  మందులు అందించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. దేశంలోని వివిధ రైల్వే స్టేషన్లలో 18 ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాలను  ఆయన ఈ రోజు జాతికి అంకితం చేశారు. బీహార్ లోని దర్బంగా నుంచి దృశ్య మాధ్యమం ద్వారా 12 వేల కోట్ల రూపాయల విలువైన ఇతర అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జన ఔషధి కేంద్రాల ద్వారా రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు. దేశంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని నరేంద్ర మోడీ పేర్కొంటూ....

(వాయిస్ 33 సెకన్లు)

==============================

జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తొలిదశలో 43 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్  ఈ రోజు జరిగింది.  కడపటి సమాచారం ప్రకారం 65 శాతం పోలింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) తెలిపింది. ఎన్నికల కమిషన్ అందించిన సమాచారం ప్రకారం సరాయికేలా-ఖర్సావాలో అత్యధికంగా 66.38 శాతం పోలింగ్ జరగింది. లోహర్‌దాగా, సిమ్‌దేగా నియోజకవర్గాలలో  వరుసగా 65.99 శాతం, 64.31 శాతాల పోలింగ్ నమోదు అయింది. ఇక రాంచీలో అత్యల్పంగా 53 శాతం ఓటింగ్ నమోదైనట్లుగా ఎన్నికల కమిషన్ పేర్కొంది. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ప్రముఖ క్రికెటర్ ఎం.ఎస్.ధోనీ రాంచీలో తన ఓటు హక్కుని వినియోగించుకున్నారు. 2వ విడత పోలింగ్ ఈ నెల 20న జరగనుంది. కాగా, దేశ వ్యాప్తంగా మరో 31 అసెంబ్లీ స్థానాలు, కేరళలో వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఈ రోజు ఉప ఎన్నికలు జరిగాయి.

==============================

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకూ 3 దేశాల్లో పర్యటించనున్నారు. ఆఫ్రికా ఖండంలోని నైజీరియాతో పాటు దక్షిణ అమెరికా ఖండంలోని బ్రెజిల్, గయానా దేశాలను ప్రధానమంత్రి  సందర్శించనున్నారు. నైజీరియా అధ్యక్షులు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు ఈనెల 16, 17వ తేదీల్లో నైజీరియాలో నరేంద్రమోదీ పర్యటిస్తారు. గత 17 సంవత్సరాల్లో భారత ప్రధానమంత్రి  నైజీరియాలో పర్యటించడం ఇదే తొలిసారని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి 2 దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సమీక్షించడంతో పాటు.. ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారని పేర్కొంది. ఈ నెల 18, 19వ తేదీల్లో బ్రెజిల్‌లోని రియోడిజనీరో నగరంలో జరగనున్న జీ-20 సదస్సులో ప్రధానమంత్రి పాల్గొంటారు. అనంతరం ఆయన గయానీస్ అధ్యక్షులు మొహమ్మద్ ఇర్ఫాన్ అలీ ఆహ్వానం మేరకు గయానాలో పర్యటించనున్నారు.

విరామం

==============================

కేరళలో అయ్యప్ప స్వామి ఆలయం శబరిమలను సందర్శించే భక్తుల కోసం రూపొందించిన 'స్వామి చాట్‌బాట్' లోగోను ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈరోజు ఆవిష్కరించారు. పతనంతిట్ట జిల్లా యంత్రాంగం అభివృద్ధి చేసిన స్మార్ట్ ఏఐ సాధనం 'స్వామి' చాట్‌బాట్ లోగో ద్వారా అయ్యప్ప యాత్రికులకు ప్రయోజనం కలుగుతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా, ఆరు భాషలైన మలయాళం, ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళం, కన్నడలో శబరిమల గురించి సమగ్ర సమాచారాన్ని 'స్వామి చాట్‌బాట్' అందిస్తుంది. శబరిమలలో పూజా సమయాలతోపాటు రైల్వే, విమాన సౌకర్యాలను తెలియజేస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లో కూడా ఈ చాట్‌బాట్‌ను వినియోగించుకోవచ్చునని  నిర్వాహకులు తెలిపారు.

==============================

గేమింగ్, యానిమేషన్, వినోద రంగాల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలను చేపడుతోందని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ దిశగా ప్రభుత్వం ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ)ని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గా ఏర్పాటు చేసిందన్నారు. హైదరాబాద్ లో ఇండియా గేమ్ డెవలపర్ కాన్ఫరెన్స్ (ఐజీడీసీ) ప్రారంభించిన సందర్భంగా పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వినోదం, యానిమేషన్ రంగంలోని ఔత్సాహికులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఐఐసీటీ ఏర్పాటు కోసం మహారాష్ట్ర ప్రభుత్వం భూమిని కేటాయించిందని పేర్కొన్నారు. ప్రపంచ మీడియా, వినోద రంగంలో భారత్ వాటా ప్రస్తుతం 2 శాతమేనని, దానిని 20 శాతం పైగా పెంచుకునేందుకు అవకాశాలున్నాయని తెలిపారు. కాగా, ఈ నెల 20వ తేదీన గోవాలో ఐ.ఎఫ్.ఎఫ్.ఐ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రసార భారతి సొంత ఓటీటీ ప్లాట్ ఫామ్ ను ప్రారంభించనుందని తెలిపారు. భారతీయ సంస్కృతిని ఆధారంగా గేమ్స్ డిజైన్స్ చేసి ప్రపంచ వేదికపై ఉంచుతామని సంజయ్ జాజు మాట్లాడుతూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పోటీ పరీక్షల కోసం విద్యార్థులకు శిక్షణనిచ్చే కోచింగ్ సెంటర్లు తప్పుడు ప్రకటనలు చేయరాదని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. కోచింగ్ కేంద్రాలు ఇచ్చే తప్పుడు ప్రకటనలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ విషయంలో కేంద్ర వినియోగదారుల భద్రత సంస్థ (CCPA)కు అనేక ఫిర్యాదులు వస్తుండడంతో ఈ నిర్ణయాన్ని వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే వెల్లడించారు. కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వం వ్యతిరేకం కాదని, అయితే ప్రకటనలనేవి వినియోగదారుల హక్కులను దెబ్బతీయకూడదని ఆమె పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాటికి ఇప్పటికే జరిమానాలు విధించామని తెలిపారు

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వియత్నాం కమ్యూనిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, హోచిమిన్ నేషనల్ అకాడమీ ఆఫ్ పాలిటిక్స్ అధ్యక్షులు డాక్టర్ గుయెన్ జువాన్ థాంగ్ తో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ ఈ రోజు ఢిల్లీలో సమావేశం అయ్యారు. భారత్, వియత్నాంల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ఈ సందర్భంగా చర్చించారు. సాంకేతిక పరిజ్ఞానంతో సహా పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఇరువురు చర్చించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెరుగైన ప్రగతిని కనబర్చాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ప్రథమార్థంలో ప్రభుత్వ రంగ బ్యాంకుల నికర లాభాలు 26 శాతం పెరిగాయని పేర్కొంది. 12 ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల వ్యాపారం 11 శాతం పెరిగి 236. 4 లక్షల కోట్ల రూపాయలుగా నమోదయ్యిందని ఆ శాఖ వివరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత నౌకాదళం ఈ నెల 21, 22వ తేదీలలో కోస్టల్ డిఫెన్స్ ఎక్సర్ సైజ్ 'సీ-విజిల్-24' 4వ ఎడిషన్ ను నిర్వహించనుంది. 6 మంత్రిత్వ శాఖలు, 21 సంస్థలు, ఏజెన్సీలతో కూడిన ఈ విన్యాసాలు 2 రోజుల పాటు విశేషంగా అలరించనున్నాయి. ఓడరేవులు, ఆయిల్ రిగ్గులతో పాటు కీలకమైన తీరప్రాంత మౌలిక సదుపాయాల భద్రతను బలోపేతం చేయడం కోసం ఈ విన్యాసాలు నిర్వహిస్తున్నారని నావికాదళ వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు ఈనెల 22వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =